# ఆహ్వానం

● కట్టా రాంబాబు ●

## వాళ్ళిద్దర్నీ చూస్తే చాలా ముచ్చటేసింది. అతనికి పాతికేళ్ళుంటాయి.

ఆమెకు ఇరవై వుండొచ్చు. ఆమె చాలా అందంగా వుంది. గుండ్రటి ముఖం, చక్రల్లాంటి కళ్ళు, బంగారం రంగుతో చూడగానే అందగత్తె అనిపిస్తుంది. అతను కూడా అందంగానే వున్నాడు. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటారు యిలాంటివాళ్ళని చూసే అనిపించింది.

అది ఒంగోలు బస్టాండ్. ఆరోజెందుకో అంతరద్దీగా లేదు. వాళ్ళిద్దరు ఓ బెంచి మీద కూర్చున్నారు. వాళ్ళకి కొంచెం దూరంలో నేను కూర్చున్నాను.

అప్పుడు సమయం సాయంత్రం ఆరుగంటలయ్యింది.

వాళ్ళిద్దరు నెమ్మదిగా మాట్లాడుకుంటున్నా నాకు వినిపిస్తోంది.

వాళ్ళను చూస్తూ, మాటలు వినడం సభ్యతగా వుండదు కాబట్టి వీక్లీలో బొమ్మలు చూస్తూ పేజీలు తిప్పుతున్నాను.

"ఊరుకో రోజా! ఎవరన్నా చూస్తే బాగుండదు. ఎంత, మూడు రోజుల్లో వచ్చేస్తానుగా. నాకు మాత్రం నిన్ను విడిచి వెళ్ళాలనుందేమిటి? వెధవ ఆఫీసు పని తప్పదు కాబట్టి వెళ్ళవలసి వస్తోంది" అన్నాడతను.

"మీరిలాగే అంటారు. మీకు దూరంగా నేను ఒక్క క్షణం వుండలేనండి. అమ్మో! మూడు రోజులంటే మూడు యుగాలుగా వుంటుంది. వెధవ ఉద్యోగం మానెయ్యండి. నెలలో నాలుగైదు సార్లు కాంపులంటూ వెళ్ళిపోతారు. నా బాధ మీకు అర్థంకాదు" అంటూ కర్చీఫుతో కళ్ళు తుడుచుకుంది.

"నువ్విలా ఏడిస్తే నేను ప్రయాణం మానుకుంటాను. మా బాస్ తిట్టినా సరే పడతాను. నన్నేం చెయ్యమంటావు చెప్పు. ఉద్యోగం అట్లాంటిది. పోనీ ఈ ఉద్యోగం వదిలేద్దామంటే మంచి జీతం. యింకో ఉద్యోగం దొరకడం కూడా అంత సులభం కాదు. అయినా ఈ కాంపులన్నీ యింకో సంవత్సరమే. తర్వాత ఆఫీసులోనే వుండొచ్చు. కొంతకాలం భరించక తప్పదు" నచ్చ చెపుతూ అన్నాడు.

వాళ్ళని చూస్తే జాలేసింది. కొత్త దంపతుల్లా వున్నారు. ఒకరి ఎడబాటును మరొకరు భరించలేక పోతున్నారు. వాళ్ళ ఎడబాటుకి కారణమైన అతని బాస్ మీద కోపం వచ్చింది. ఇటువంటి కొత్తగా పెళ్ళయిన వాళ్ళను పంపకుండా కాస్త వయసు ముదిరిన వాళ్ళను పంపొచ్చుగా.

"రోజా! నీకు హైదరాబాదు నుంచి ఏం తెమ్మంటావు చెప్పు. చీరలేమైనా తీసుకురానా"

"నాకేం వద్దు మీరు క్షేమంగా రండి అంతే చాలు. మూడు రోజులకు మించివుంటే నేనిక్కడ భరించలేను మీరు నాలుగో రోజుకి రాకపోతే నేనిక్కడ ఆత్మహత్య చేసుకుంటాను తెలుసా?" అంటూ బెదిరించిందా అమ్మాయి.

"అంత మాటనకు రోజా! నువ్వు లేకపోతే నేనసలు బ్రతకలేను. ఆ వూహే భరించలేను. నీకోసం వుద్యోగమేమిటి దేన్నయినా వదులుకుంటాను. ఈసారి మా బాప్‌కి చెప్పేస్తాను. నెలకోసారికంటే ఎక్కువ వెళ్ళనని. ఈ సారికి తప్పదు మరి.

"యింకో నెల వరకు మీరు కాంపంటే అసలు వూరుకోను. మీరు వెళితే నేను మా పుట్టింటికి పోయి నెల రోజుల వరకు రాను. తెలుసా?" అందా అమ్మాయి.

ఆ భార్యా భర్తలు ఒకరంటే ఒకరికీ వున్న ప్రేమను చూస్తుంటే నిజంగా

●●●

**'మీరలాగే అంటారు. మీకు దూరంగా నేను ఒక్క క్షణం ఉండలేనండీ' అందామె.**

●●●

వాళ్ళెంత అదృష్టవంతులు అనిపించింది.

వాళ్ళనుంచి దృష్టి ఎంత మరల్చుకుందామన్నా వీలుకావడం లేదు.

ఆ అమ్మాయి నావంక ఒకటి, రెండు సార్లు చూసి తల తిప్పుకుంది.

నేనెక్కవలసిన బస్ కూడా రాలేదు. అయినా బోర్ కొట్టడం లేదు. ఆ దంపతుల్ని, వాళ్ళ మాటల్ని వింటుంటే ఎంతసేపయినా అక్కడే వుండాలనిపిస్తుంది.

యింతలో వాళ్ళ దగ్గరకో అమ్మాయి వచ్చింది. ఆమె కూడా అందంగానే వుంది. అయితే ఆమె అతిగా అలంకరించుకుంది. చేతిలో చిన్న లెదర్ బాగ్ వుంది.

●●●

వాళ్ళనుంచి దృష్టి ఎంత మరల్చుకుందామన్నా వీలుకావడం లేదు.

●●●

"హాయ్! రవీ ఎక్కడికి ప్రయాణం లాగుందే. సతీసమేతంగా వెళుతున్నట్టున్నారు" అంటూ పలకరించింది అమ్మాయి.

"హలో లావణ్యా నువ్వా! హైదరాబాద్ క్యాంపు కెళుతున్నా. ఒక్కణ్ణే వెళుతున్నాను. నా శ్రీమతి నాకు సెండాఫ్ యివ్వడానికి వచ్చింది. అన్నట్టు నా శ్రీమతిని పరిచయం చెయ్యలేదు కదూ నా శ్రీమతి రోజా!" అంటూ భార్యను చూపించి "ఈమె మా ఆఫీసులో టైపిస్టు" అంటూ యిద్దరికీ పరిచయం చేసాడు.

ఆ అమ్మాయిని చూసిన వెంటనే రోజా ముఖంలో మార్పు వచ్చింది.

అందమైన అమ్మాయి భర్త ఆఫీసులో టైపిస్టుగా వుందంటే కలిగే అసూయలా వుంది.

"ఎక్కడికి లావణ్యా బయలుదేరావ్" అనడిగాడు రవి.

"నరసారావు పేట వెళుతున్నాను. మా అక్కను చూడాలని బయలుదేరాను" చెప్పింది లావణ్య.

"యిప్పుడు బస్సు లేమైనా వున్నాయా" అనడిగాడు రవి.

"హైదరాబాదు బస్సుందిగా" చెప్పింది.

"అయితే నేనెక్కే బస్సన్న మాట" అన్నాడు రవి.

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటుంటే రోజా వాళ్ళను చూస్తూ కూర్చుంది. మళ్ళీ నావైపు ఒకసారి చూసి తల తిప్పుకుంది.

"యిప్పుడే వస్తానుండు రవీ" అంటూ అక్కడనుంచి కదిలింది లావణ్య. వాళ్ళిద్దరే వున్నారు.

"బస్సింకో పావుగంటలో వస్తుందేమో. నాకేదో దిగులుగా వుందండి' అంది రోజా. మళ్ళీ ఆమె కళ్ళలో నీళ్ళు.

"మరీ యింత పిచ్చిదానివనుకోలేదు రోజా. నువ్వలా దిగులుగా ముఖం పెడితే నాకు బస్సెక్కాలనిపించదు. నువ్వు నన్ను నవ్వుతూ పంపితే నా పని త్వరగా ముగించుకుని రాగలను. లేకపోతే నీ మీద దిగులుతో నాకక్కడ పని పూర్తి కాక యింకో రోజు లేటయినా అవ్వొచ్చు" అన్నాడు.

"అమ్మో! అయితే నేనింక ఏడవను లెండి. మీరు మాత్రం త్వరగా వచ్చెయ్యండి".

యింతలో హైదరాబాదు బస్సు ప్లాట్ ఫారం మీదకు వచ్చింది.



రవి తన సూట్‌కేసు తీసుకుని పైకి లేచాడు. రోజా కూడా భర్తతో పాటు బస్ దగ్గరకు నడిచింది. యింతలో లావణ్య కూడా బస్ దగ్గరకు వచ్చింది.

రవి, లావణ్య బస్సెక్కడం, బస్ బయలుదేరడం జరిగింది.

రోజా ప్లాట్ ఫారం మీద నిలబడి భర్తకు టాటా చెపుతోంది.

బస్సు అక్కడ నుంచి రోడ్డెక్కే వరకు అక్కడే నిలబడి వుందామె.

నేను కూర్చున్న చోట నుంచే చూస్తున్నాను.

సమయం ఏడుగంటలయ్యింది. నేను ఎదురుచూస్తున్న బస్సింకా రాలేదు.

ఆమె అక్కడ కాస్సేపు నిలబడి వెనక్కి తిరిగి నా వంక చూసింది. నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి నా ఎదురుగా నిలబడింది.

ఆమె నా దగ్గర కెందుకొచ్చిందో అర్థం కాలేదు. నా ప్రక్కనే కొంచెం దూరంలో కూర్చుంది. ఆమెకు నాకు మధ్య రెండడుగులు దూరం వుంటుంది. ఆమె నా వంక చూసి నవ్వింది నేనూ నవ్వాను. భర్త వెళ్ళిన విచారాన్ని మరిచి పోవడానికి నాతో కాస్సేపు మాట్లాడి యింటికెళ్ళాలనుకుందేమో అనుకున్నాను.

ఆమె ముఖంలో యింతకు ముందున్న విచారం లేదు.

ఆమె నా వంక మళ్ళీ నవ్వుతూ చూసి "వస్తారా" అంది.

నాకేం అర్థం కాలేదు ఆమె ఏం మాట్లాడుతుందో.

"వస్తారా" అని మళ్ళీ అడిగింది.

"ఎక్కడికి?" అన్నాను ఆశ్చర్యంగా.

"భలెవారే ఎక్కడికో అయితే నేనెందుకు పిలుస్తాను. మా యింటికే"

"ఎందుకు?"

"అంత అమాయకులేమిటండి. ఒక అందమైన అమ్మాయి ఓ మగాడి దగ్గరకొచ్చి యింటికి రమ్మంటే అందులోను భర్తలేని సమయంలో రమ్మంటే ఎందుకో తెలియదంటే నన్ను నమ్మమంటారా" అంది.

నేనసలు జీర్ణిచుకోలేక పోతున్నాను. యింతవరకు చూసిందేమిటి? యిప్పుడు చూస్తున్నదేమిటి? భర్తతో ఎంతో ప్రేమగా మాట్లాడి అతన్ని పంపించి యిప్పుడిలా మాట్లాడుతుంటే ఏమనుకోవాలి.

"మీరెందుకు సందేహిస్తున్నారో నేనర్థం చేసుకోగలను. మేమిద్దరం మాట్లాడుకున్నవి మీరు విన్నారని నాకు తెలుసు.

మీరూహించినట్లు మా భార్యాభర్తల మధ్యనున్నది నిజమైన ప్రేమ కాదు. ఒకరినొకరం నమ్మించుకోవడానికి చేసిన ప్రయత్నం. మా ఆయన నిజానికి శ్రీరామ చంద్రుడేం కాదు. అపరగోపాల కృష్ణుడు. ఆయనకు చాలా మంది గోపికలున్నారు. పెళ్ళికి ముందంటే వెధవ్వేషాలేసుండొచ్చు. పెళ్ళయింతర్వాత కూడా అటువంటి వేషాలెందుకు చెప్పండి.

ఇంట్లో అందమైన పెళ్ళాన్ని పెట్టుకుని దాన్ని పట్టించుకోకుండా బయట వేషాలేస్తుంటే నేను మాత్రం ఎంతకాలం వూరుకోవాలి చెప్పండి.

మగాడికో నీతి ఆడదానికో నీతి ఎందుకు. నేనూ నా భర్తలాగే ఎందుకుండకూడదనిపించింది. యిప్పుడు నా భర్త వెళ్ళింది ఆఫీసు పనిమీద కాదు. ఆ టైపిస్టు లావణ్యతో కులకడానికి హైదరాబాదు వెళ్ళారు. వాళ్ళిద్దరూ ముందు అనుకుని వేసుకున్న ప్రోగ్రామది. ఏమీ తెలియనట్టు యిప్పుడే కలుసుకున్నట్టు నాటకమాడారు. లావణ్య వ్రాసి ఫైల్లో పెట్టిన ఉత్తరం ఆ ఫైలు మావారు యింటికి తెచ్చినప్పుడు చూసాను. అయితే నేను చూడనట్టే వున్నాను.

నెలకు నాలుగుసార్లు కాంపుల పేర్లతో గర్ల్ ఫ్రెండ్స్‌తో షికార్లు. వారానికి రెండుసార్లు ఈ వూళ్ళోనే హోటల్స్‌లో కాలక్షేపాలు. నన్ను నిర్లక్ష్యం చేస్తున్న నా భర్త కోసం నేనెందుకు మడికట్టుకు కూర్చోవాలి చెప్పండి. అందుకే నేనూ యిద్దరు, ముగ్గురు బాయ్ ఫ్రెండ్స్‌ను సంపాదించుకున్నాను. నా భర్త వూళ్ళో లేనప్పుడు అతను బయట తన గర్ల్ ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేస్తున్నట్టే నేనూ నా బాయ్ ప్రెండ్స్‌తో ఎంజాయ్ చేస్తున్నాను.

తనని నేనెంతో ప్రేమిస్తున్నట్లుగా నా భర్త అనుకుంటూ వుంటాడు. ఆ నమ్మకం కలిగించడానికే ప్రతిసారి అతను కాంపు కెళుతున్నప్పుడు ఏడుస్తూ సాగనంపి ఆనందంగా బాయ్ ఫ్రెండ్స్‌తో యింటికి పోతాను. భర్త వ్యభిచారం చేస్తుంటే భర్యా వెంటనే కనిపెట్టెయ్యగలదు. కాని భార్య వ్యభిచారం చేస్తుంటే అందిరికంటే ఆఖర్న తెలిసేది భర్తకే. నా భర్తకు ఎట్టి పరిస్థితుల్లోను నా మీద అనుమానమొచ్చే అవకాశం లేదు.

ఎందుకో మీరు నాకు నచ్చారు. ఈ రోజు మీతో గడపాలనిపించింది. అందుకే మిమ్మల్ని మా యింటికి ఆహ్వానిస్తున్నాను. మీకిష్టమయితే రండి" అంటూ ఆగింది రోజా.

ఆమె చెప్పింది వింటుంటే తలంతా దిమ్మెత్తిపోయింది.

"చూడమ్మా! యిప్పుడు నువ్వు చేస్తున్న పనిని నీకు నువ్వు సమర్థించుకున్నా నువ్వు చేస్తున్న పని మాత్రం చాలా తప్పు. నీకు చేతనయితే నీ భర్తను మార్చుకోవడానికి ప్రయత్నించు. అంతేగాని అతనిలాగే నేనూ ప్రవర్తిస్తానంటే అది సరియైన పద్ధతి అనిపించుకోదు. అయినా నువ్వు చేస్తున్న తప్పు యిప్పుడు నీకు అర్థం కాకపోయినా రేపన్న రోజున నీకు నువ్వు క్షమించుకోలేని రోజు వచ్చినప్పుడు ఎవరూ నిన్ను కాపాడలేరు.

నీ ఆహ్వానం మరొకరయితే ఆనందంగా స్వీకరించే వారేమో కాని నేను మాత్రం స్వీకరించలేక పోతున్నాను. ఎందుకంటే నువ్వే అన్నావు చూడు మగాడికో నీతి ఆడదానికో నీతి అని. నేను దానిని పాటించే వాణ్ణి. నా భార్య పవిత్రంగా వుండాలని నేను కోరుకుంటున్నట్లే నేను పవిత్రంగా వుండాలని నా భార్య కోరుకుంటుంది కదా కాబట్టి నేను నీతో రాలేను" అన్నాను.

"సర్లెండి ఆ గొడవంతా ఎందుకు. మీరుకాకపోతే మరొకరు. మగాడికి ఆడది కావాలంటే దొరక్కపోవచ్చేమోగాని, ఆడదానికి మగాడు కావాలంటే క్షణంలో సంపాదించుకుంటుంది. నా బాయ్ ఫ్రెండ్‌కు కబురు పెడితే ఆనందంగా గంతులేసుకుంటూ వస్తాడు" అని చెప్పి వెళ్ళిపోతున్న ఆమెను చూస్తూ వుండిపోయాను.

అప్పుడనిపించింది. యిట్లాంటి ఆడవాళ్ళుంటారా అని. అంతేకాదు యింట్లో భార్యల్ని నిర్లక్ష్యంచేసి బయట తిరుగుళ్ళు తిరిగే భర్తలకు తనో ఉదాహరణ అని చెప్పుతున్నట్లుగా కూడా అనిపించింది. ●

●●●

**ఆమె అక్కడ కాస్సేపు నిలబడి**
**వెనక్కి తిరిగి నావంక చూసింది.**

●●●